క్లుప్తంగా

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి

ముసునూరు: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోళ్లు నిర్వహించాలని నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి అధికారులను ఆదేశించారు. మండలంలోని రమణక్కపేట, చెక్కపల్లిల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గత ఏడాది కొనుగోళ్ల వివరాలు, సంచుల లభ్యత, రైతులకు నగదు చెల్లింపులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం తెలిపే పరికరాల పని తీరును పరిశీలించారు. సివిల్ సప్లయిస్ డీటీ వెంకటేశ్వరరావు, డీటీ ఎమిలీకుమారి, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

తోటమూల(గంపలగూడెం): ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి ఎం. వెంకటలక్ష్మి ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. పెనుగొలను గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ శేషిరెడ్డి, గ్రంథాలయ నిర్వహణాధికారి శ్రీలత పాల్గొన్నారు.

● **చాట్రాయి:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మర్లపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు సత్తెనపల్లి శ్రీనివాసరావు విద్యార్థులకు అల్పాహారం, బహుమతులు అందజేశారు. పోలవరం కేపీ ప్రాథమిక పాఠశాల, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

రేపాకకు 'గిడుగు' పురస్కారం అందజేత

తిరువూరు: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ ప్రకటించిన జాతీయ సాహితీ పురస్కారాన్ని తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్ గురువారం అందుకున్నారు. విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు కాంతికృష్ణ, ఐఆర్ఎస్ అధికారి జెల్లి విద్యాధర్, నవ్యాంధ్ర రచయితల సంఘాధ్యక్షుడు బిక్కి కృష్ణ చేతుల మీదుగా రఘునందన్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. రేపాక రఘునందన్‌ను పలువురు రచయితలు అభినందించారు.

కిడ్నీ రోగుల గుర్తింపునకు సమగ్ర సర్వే ప్రారంభం

తిరువూరు: జిల్లా కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు తిరువూరు మండలంలో గురువారం కిడ్నీ రోగుల గుర్తింపునకు సమగ్ర సర్వే ప్రారంభమైంది. చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కనకదుర్గా భవానీ ఆధ్వర్యంలో చౌటపల్లి, టేకులపల్లి, కాకర్ల, రామన్నపాలెం గ్రామాల్లో తొలి రోజు రక్త నమూనాలు సేకరించారు. కిడ్నీ వ్యాధికి గురైన వారి పూర్తి వివరాలు సేకరించి వారికి ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన సహాయ కార్యక్రమాలపై కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నామని వైద్యాధికారి తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీ లోగా సర్వే పూర్తిచేయనున్నామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత పెంపొందించేందుకు ప్రతి ఏడాది చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని జన విజ్ఞాన వేదిక నాయకులు తెలిపారు. కొండపల్లి డాక్టర్ మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ వైద్యశాలలో జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 25న పాఠశాల, అక్టోబర్ 1న మండల స్థాయి, 27న జిల్లా స్థాయి, నవంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. 8, 9, 10 తరగతుల ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీ మోహన్, పట్టణ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు పాల్గొన్నారు.

నిబంధనలపై అవగాహన

తిరువూరు: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తిరువూరు సీఐ గిరిబాబు అన్నారు. ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించారు. ఆటోడ్రైవర్లు లైసెన్సు కలిగి ఉండాలని, ఆటోకు ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

నూజివీడు: బాలికలు చదువుపైనే దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్ర అన్నారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. మహిళా కమిషన్ సభ్యురాలు బి.వినీత మాట్లాడుతూ ఆడపిల్లలను ఇబ్బందులకు గురిచేసినా, వేధించినా కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. ముందుగా వీరిరువురూ గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆర్డీవో వై.భవానీశంకరి మాట్లాడుతూ చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. అనంతరం స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవాల సందర్భంగా ధ్యాన్‌చంద్, గిడుగు రామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీడీపీఓ ఎస్వై నూరాని, ఏసీడీపీఓ నాగేశ్వరి, డీవైఈఓ ఎం.సేవియా పాల్గొన్నారు.



చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

వైద్యులపై తరచూ దాడులు జరుగుతుండటం శోచనీయం. ప్రజలకు నిరంతరం వైద్యసేవలందించే వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య వంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. పని చేసే ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలి.

-కాలసాని గోపాల నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్, తిరువూరు



రక్షణ కల్పించాలి

రోగులకు సేవ చేసే పవిత్రమైన వృత్తిలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వైద్యులకు రక్షణ కల్పించాలి. భవిష్యత్‌లో కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. వైద్యులు, వైద్య సిబ్బందిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి.

-ఎన్. రఘు, ల్యాబ్ టెక్నీషియన్, తిరువూరు



మాతృభాషను మరవద్దు

● ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
● గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

తిరువూరు: జీవనోపాధి కోసం ఏ భాషలో చదివినా మాతృభాషను మాత్రం మరవొద్దని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు విజయానందరాజు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు భాష ఔన్నత్యంపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో విజయానందరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలోని తియ్యదనం ఇతర భాషల్లో లేదని, ఎందరో కవులు, రచయితలు రచించిన గొప్ప రచనలు తెలుగులోనే ఉన్నాయన్నారు. గిడుగు రామ్మూర్తి తెలుగును వ్యావహారిక భాషగా వినియోగించడంలో చేసిన కృషిని వివరించారు. తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిడుగు చిత్రపటానికి సుందరయ్య విజ్ఞాన కేంద్ర కన్వీనర్ పాపారావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

రామ్మూర్తి సేవలు ఎనలేనివి

పెనుగొలను(గంపలగూడెం): తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు మరువలేనివని పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాఫర్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు గిడుగు రామ్మూర్తి సేవలను కొనియాడారు.

● **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూరి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం బి.పద్మలత మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి సేవలను వివరించారు. బాలికలు వివిధ వేషధారణలలో అలరించారు.





గంగినేని జెడ్పీ హైస్కూల్లో తెలుగు కవుల చిత్ర పటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు : పెనుగొలను హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

● **చంద్రాల(మైలవరం):** చంద్రాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరద శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను కొనియాడారు. రెడ్డిగూడెం మండలం బూరుగుగూడెం ఎంపీపీ పాఠశాలలో తెలుగుతల్లి, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు నివాళులర్పించారు.

● **జి.కొండూరు:** గంగినేని జెడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనం, తెలుగు భాష ఉనికి కోసం గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను తెలుగు ఉపాధ్యాయుడు పెదగమ్మళ్ల నాగరాజు వివరించారు. వంద మంది తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలు, ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

● **కొటికలపూడి(ఇబ్రహీంపట్నం):** కొటికలపూడి, కాచవరం ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, పద్యాల పోటీలు నిర్వహించారు. తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థులు అలరించారు. కాచవరంలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు రాజేశ్వరి, రాఘవకుమారి, ఉపాధ్యాయులు ఇర్ఫాన్‌పాషా, ఖాశీం, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

నూజివీడు: పట్టణంలోని త్రివిధ స్కూల్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ తెలుగు భాష గొప్పదనాన్ని , వైభవాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గిడుగు రామ్మూర్తి పంతులు, పోతన, వేమన, గుర్రం జాషువా, గురజాడ అప్పారావు వేషధారణలో అలరించారు.



మాతృభాషను గౌరవించాలి

తిరువూరు: తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'తెలుగు భాష గొప్పతనం' అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ ఎం. సుశీలరావు మాట్లాడుతూ ఉపాధి, విజ్ఞానం కోసం ఇతర భాషలు నేర్చుకున్నప్పటికీ మాతృభాషను మరువవద్దని సూచించారు. తిరువూరు శ్రీనిధి స్కూల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. నాగార్జున స్కూల్లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిద్ధార్థ స్కూల్లో తెలుగు పద్యపోటీలు నిర్వహించారు. తెలుగు భాషా సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావును విద్యార్థులు సత్కరించారు. గానుగపాడు, మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో, లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్లో మాతృభాషా దినోత్సవం జరిపారు. తిరువూరు గ్రేడ్-1 గ్రంథాలయంలో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి గ్రంథాలయాధికారి పద్మావతి, పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఎల్బీఆర్సీఈలో..

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, డీన్స్, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శివహరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం జరిగింది. కళాశాలలో వాలీబాల్, త్రోబాల్, బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు.

● **ఆగిరిపల్లి:** చొప్పరమెట్ల మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరువూరు సుందరయ్య భవన్‌లో మాట్లాడుతున్న విజయానందరాజు



కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మల్లేల జెడ్పీ హైస్కూల్లో జాతీయ క్రీడా, మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



గంపలగూడెం కేజీబీవీలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జ్వరాలతో విద్యార్థులు ఇంటి బాట

● రోజుకు 20 మంది వరకు ఇళ్లకు చేరుతున్న వైనం
● రాత్రి వేళల్లో పర్యవేక్షణ కరువు
● అత్యవసర పరిస్థితుల్లోనూ తల్లిదండ్రులకు అనుమతి నిరాకరణ

తిరువూరు: తిరువూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం 'సాక్షి' మధ్యాహ్న భోజనం పరిశీలనకు వెళ్లగా ప్రిన్సిపాల్ కోటిరెడ్డి అనుమతించలేదు. తమ కళాశాల నిబంధనల ప్రకారం మీడియాకు అనుమతి లేదని, మీకు చేతనైంది చేసుకోండని దురుసుగా ఫోనులోనే సమాధానం చెప్పారు.

నిరుపయోగంగా డిస్పెన్సరీ

ఈ సందర్భంగా విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం కళాశాలలో రోజుకు 20 మంది వరకు జ్వరం బారిన పడి ఇంటి బాట పడుతున్నారు. గతంలో గురుకులంలో డిస్పెన్సరీ నిర్వహిస్తూ స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్ట్ ఉండేవారు. ప్రభుత్వాస్పత్రి నుంచి కూడా వైద్యులు వచ్చి నెలలో రెండుసార్లు వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసేవారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, చర్మవ్యాధులు, ఇతర రోగాలతో ఇబ్బంది పడే విద్యార్థులకు కళాశాలలోనే డిస్పెన్సరీలో చికిత్స చేసేవారు. ఇప్పుడు వైద్య సిబ్బంది లేకపోవడంతో పార్ట్‌టైం నర్సింగ్ సిబ్బందిని పిలిపించి అవసరమైనప్పుడు మాత్రమే వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఎక్కువమంది విద్యార్థులు జ్వరం కారణంగా ఇళ్లకు వెళ్లిపోతున్నారని, జ్వరపీడితులైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ సరైన వైద్యసదుపాయాలు కల్పించకపోగా.. 2, 3 రోజుల తర్వాత తల్లిదండ్రులకు సమాచారం అందించి వారికి పిల్లల్ని అప్పగిస్తున్నట్లు చెబుతున్నారు. భోజనం బాగుండటం లేదని, అన్నం ముద్దగా ఉంటోందని విద్యార్థులు వాపోయారు.



తిరువూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిరుపయోగంగా ఉన్న డిస్పెన్సరీ

రాత్రివేళ పర్యవేక్షణ కరువు

తిరువూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో రాత్రివేళ విద్యార్థులపై పర్యవేక్షణ కరువైంది. అధ్యాపకుల్లో రాత్రివేళ ఒకరు తప్పకుండా విధుల్లో ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ తదనుగుణంగా జరగడం లేదు. ఇటీవల ఒక విద్యార్థి ఛాతీ నొప్పితో బాధపడగా అత్యవసర చికిత్స అందించేందుకు ఎవరూ లేక తోటి విద్యార్థులే ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందని తెలిసింది. ఆ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పట్టించుకోకుండా అతని తల్లిదండ్రులు వచ్చేవరకు వైద్య చికిత్స చేయించలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల రాత్రివేళ కొందరు విద్యార్థులు గోడదూకి బయటికి వెళ్లిపోతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని తిరిగి కళాశాలలో అప్పగించారు.

జోగి రమేష్‌కు జిల్లా నేతల అభినందన

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి జోగి రమేష్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ కలిసి కొద్దిసేపు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పార్టీ వ్యవహారాలపై చర్చించారు. జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్‌కు సంఘీభావం తెలిపారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలకు అండగా నిలవాలని నిర్ణయించారు. కొటికలపూడి సర్పంచి రెంటపల్లి నాగరాజు, మండల నాయకుడు బాణావత్ బాలాజీ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా

● రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు
● టెన్‌టైర్ల లారీకి రూ. 8 వేలు వసూలు

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం (దొనబండ)లో గ్రావెల్ అక్రమ రవాణాకు టీడీపీ నాయకులు తెరతీశారు. పొక్లెయిన్‌లతో పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా రవాణా చేస్తూ లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారు. గ్రామంలోని ముగ్గురమ్మల ఆలయం రోడ్డు చివరలో విజయవాడకు చెందిన ఓ కాంట్రాక్టర్ రాతి క్వారీలో పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వకం ప్రారంభించారు. రాతి క్వారీ అనుమతులు కూడా ఈ ఏడాది మార్చితో ముగిసినట్లు తెలిసింది. అయినా లారీలు, ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నారు. గ్రావెల్ తరలింపులో గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన వ్యక్తి ప్రధాన భూమిక పోసిస్తుండటం గమనార్హం. టెన్‌టైర్ల లారీకి రూ.8 వేలు, 6 టైర్ల లారీకి రూ.5 వేలు, ట్రాక్టర్‌కు రూ.2 వేల చొప్పున వసూలు చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

స్థానికులు విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారిలో స్పందన కనిపించడం లేదు. గ్రావెల్ తరలించే క్వారీ వైపునకు తిరిగి చూసేందుకు సాహసించలేక పోతున్నారనే వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది. దీంతో అక్రమార్కులు రెచ్చిపోయి అక్రమ మార్గాన గ్రావెల్ తరలిస్తున్నారు. క్వారీల్లో ఓ సామాజికవర్గం పెత్తనం ఉండటంతో అధికారులు ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



కాచవరంలో ట్రాక్టర్‌తో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ (ఫైల్)

సంక్షిప్తంగా...

● **యూనిఫాం పంపిణీ**

మైలవరం: ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరంలోని శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో గిరిజన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఉచితంగా అందిస్తున్న యూనిఫాంను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం అందజేసి మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం ఉడతా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● **క్రీడా దుస్తుల బహూకరణ**

నూజివీడు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో గురువారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. క్రీడా దుస్తులు అందజేశారు.

● **దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను రోడ్లపై తిప్పవద్దు**

మైలవరం: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను రోడ్లపై తిప్పవద్దని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్‌లకు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ దమ్ము చక్రాల వలన రోడ్లు ధ్వంసమవుతున్నాయని గుర్తించాలన్నారు.

● **విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ**

గంపలగూడెం: రక్తహీనత నివారణకు గంపలగూడెం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు గురువారం ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను గురువారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత ఏర్పడితే అనారోగ్యంతో పాటు చదువు కూడా మందగిస్తుందన్నారు. ఏఎన్ఎం రాణి, పీఈటీ రూతమ్మ పాల్గొన్నారు.

● **విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు**

గంపలగూడెం: నేత్రాల విషయంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్యులు డాక్టర్ ప్రవీణ్ అన్నారు. గంపలగూడెం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గురువారం 70 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి కంటి చూపు లోపం ఉన్నట్లు నిర్ధారించారు. వారికి కళ్లజోళ్లు సిఫారసు చేశారు. విద్యాలయం ప్రత్యేకాధికారి ఎం. వెంకటలక్ష్మి, ఏఎన్ఎం రాణి, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● **గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ**

నూజివీడు: జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో మండలంలోని దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ గురువారం ఓగిరాల తండా, లైన్‌తండాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితులను పరీక్షించి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను భుజించాలని, ప్రజలు దోమ తెరలు వాడాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే ఏఎన్ఎంకు కానీ, ఆశా వర్కర్‌కు గాని తెలియజేయాలన్నారు.

● **ముసునూరు:** ముసునూరు పీహెచ్‌సీ పీహెచ్‌సీ పరిధిలోని గోపవరం-1, 2 సచివాలయాలు, పెదపాటివారిగూడెం, ముసునూరు, కొర్లగుంట గ్రామాల్లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

● **కిషోర బాలికలకు అవగాహన**

ముసునూరు: మండలంలోని పలు పాఠశాలల్లో కిశోర బాలికలకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కాట్రేనిపాడు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం అనూరాధ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఇంటా తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

● **దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం**

మైలవరం: మైలవరానికి చెందిన మద్దినేని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు మైలవరం కోర్టు ప్రాంగణంలోని ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ (దివ్యాంగులు) పాఠశాల విద్యార్థులకు గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్ చారుగుండ్ల ప్రసాద్, జడ్జీ లయన్ జాస్తి వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రెసిడెంట్ లయన్ తిరుమలశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

● **క్రీడా పరికరాల వితరణ**

గంపలగూడెం: గంపలగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చిమట సురేష్‌బాబు రూ.10 వేల విలువైన క్రీడా పరికరాలను ప్రధానోపాధ్యాయులు బొల్లెపోగు కిరణ్‌కు గురువారం అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ క్రీడా పరికరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఈటీ రాంబాబు, డీ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బూరుగు జమలయ్య, ఉపాధ్యాయులు ఎం. కొండలు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

● **వివాహిత అనుమానాస్పద మృతి**

చాట్రాయి: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతిచెందింది. ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తమ్ముగూడెం శివారు టి.గుడిపాడుకు చెందిన కొమ్ము స్వాతి (28)కి ఎనిమిదేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన పాపారావుతో వివాహమైంది. వీరికి సంతానం లేదు. ఇటీవల అనారోగ్యానికి గురై మంగళగిరి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి సోదరుడు వినోద్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

● **బైక్ అదుపుతప్పి వృద్ధుడికి గాయాలు**

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): బైక్ అదుపుతప్పి పల్టీకొట్టిన ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇబ్రహీంపట్నం ఫెర్రీకి చెందిన వెలగా వెంకటరావు (61) వ్యక్తిగత పనులపై గుంటుపల్లి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సెయింట్ ఆన్స్ స్కూల్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఎస్ఐ అనూష క్షతగాత్రుడిని స్థానిక పీహెచ్‌సీకి, అనంతరం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలని వినతి

ఇబ్రహీంపట్నం: స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వీక్లీ ఆఫ్‌లు, పండుగ సెలవులు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆశారాణికి గురువారం వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సెలవులు, కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. మహిళా కార్మికులకు పని ప్రదేశంలో భద్రత, రెస్ట్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని, జాతీయ పండుగలకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఎం.మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, సుబ్బారావు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.